

కళ్యాణలక్ష్మి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పరిశీలన

- లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి విచారించిన తహసీల్దార్ అశోక్

02



మంగళవారం 03 నవంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:13

పటాన్‌చెరు పారిశుధ్యానికి ఆధునిక యంత్రాలు

-12 కోట్లతో 10 స్వీపింగ్ మిషన్ లు

10 టిప్పర్ల కొనుగోలు

-తోషిబా పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో వాహనాల సమకూర్పు..

-మైత్రి మైదానంలో ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి





పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)

విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు.. పెరుగుతున్న జనాభా.. రోజురోజుకూ అధికమవుతున్న పారిశుధ్య అవసరాలకు అనుగుణంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆధునిక పారిశుధ్య యంత్రాంగం అందుబాటులోకి వచ్చింది. చెత్త సేకరణ, రహదారుల శుభ్రతను మరింత వేగవంతం చేసి, కాలనీల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చొరవతో రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 10 స్వీపింగ్ మిషన్ లు, 10 టిప్పర్లను కొనుగోలు చేశారు. వివరాలు 2లో



విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలి కలెక్టర్

- రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మెదక్ జిల్లా కు ప్రథమ స్థానం కైవసం- ఉత్తమ పార్లమెంటరిన్ గా

- అద్భుత ప్రతిభ సాధించిన ఆర్తి చంద్రనుఅభినందించిన

-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

నవంబర్ 2 మెదక్ జిల్లా

బ్యూరో ప్రజాజ్యోతి :

సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో మాక్ పార్లమెంట్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కలెక్టర్ ఘనంగా సత్కరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివరాలు 2లో

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఫిర్యాదుదారుల సమస్య లను నేరుగా విన్న

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



నవంబర్ 2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి:

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, వివరాలు 2లో

పటాన్‌చెరు పారిశుధ్యానికి ఆధునిక యంత్రాలు

మొదటిపేజీ తరువాయి

సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలి విడత వాహనాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తోషిబా పరిశ్రమ ప్రతినిధి మారు మోటో ప్రారంభించారు.

తొమ్మిది డివిజన్ లకు పారిశుధ్య సేవలు

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ సర్కిళ్లలో మొత్తం తొమ్మిది డివిజన్ లకు పారిశుధ్య సేవలు విస్తరించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. తొలి విడతలో అమీన్‌పూర్ సర్కిల్‌కు మూడు స్వీపింగ్ మిషన్ లు, మూడు టిప్పర్లు, పటాన్‌చెరు సర్కిల్‌కు రెండు స్వీపింగ్ మిషన్ లు, రెండు టిప్పర్లు కేటాయించినట్లు వెల్లడించారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు జాతీయ రహదారి పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా మరో స్వీపింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ వాహనాలు పారిశుధ్య నిర్వహణలో కీలకంగా ఉపయోగపడతాయని వివరించారు.

పారిశుధ్య సిబ్బంది నియామకాలు చేపట్టాలి

గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గంలో వందలాది కొత్త కాలనీలు ఏర్పడ్డాయని, పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరణించిన కార్మికుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో సిబ్బంది కొరత ఏర్పడిందని, ఫలితంగా చెత్త సేకరణలో జాప్యం జరుగుతోందని అన్నారు. ప్రతి డివిజన్‌కు స్వీపింగ్ మిషన్, టిప్పర్‌తోపాటు జేసీబీని అందుబాటులో ఉంచాలని, అవసరమైన సిబ్బందిని తక్షణమే నియమించాలని ప్రభుత్వానికి సూచించారు.



ప్రజల భాగస్వామ్యంతోనే పరిశు

భ్రత

కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలంటే ప్రజల సహకారం కూడా అవసరమని ఎమ్మెల్యే అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులు అందించిన తోషిబా పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకరించాలని కోరారు.

అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

తోషిబా పరిశ్రమ ప్రతినిధి మారు మోటో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని పేర్కొన్నారు. సీఎంసీ పరిధిలో పారిశుధ్య వాహనాల కొనుగోలుకు ఎమ్మెల్యే తీసుకున్న చొరవను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు కావ్య, లలిత శ్రావణి, తోషిబా ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలి కలెక్టర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లోని ఎస్ సి ఇ ఆర్ టి గోదావరి ఆడిటోరియంలో రాష్ట్రస్థాయిలోనిర్వహించిన ఈ కార్యక్రమంలో 33 జిల్లాల నుండి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ గామెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్తి చంద్ర వ్యవహరించడం జరిగిందని రాష్ట్రస్థాయిలో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంటులో ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై అద్భుత ప్రదబి కనపరిచి ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో మంచిర్యాంకు సాధించాలని భవిష్యత్తులోఉన్నతస్థానాలకు ఎదగాలని సూచించారుఆర్తి చంద్రను ఆమెకు గైడ్ టీచర్ గా వ్యవహరించినవ్యవహరించినటువంటి లింగమయ్య పిజిటిని , పాఠశాల ప్రిన్సిపాల్ ను, వీరికి సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు మరియు రవిబాబులను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పరిశీలన

మొదటిపేజీ తరువాయి

కొండాపూర్, ప్రజా జ్యోతి:

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని చర్ల గోపులారం గ్రామంలో కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడి ఇంటికి తహసీల్దార్ అశోక్ నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను పరిశీలించి, లబ్ధిదారుడి కుటుంబ పరిస్థితులు, సంబంధిత ధ్రువపత్రాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, క్షేత్రస్థాయిలో వివరాలను నిర్ధారించిన అనంతరం అర్హత ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి అధికారులకు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

మొదటిపేజీ తరువాయి



ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

భూ భారతి రీ సర్వేలో ప్రతి భూ యజమాని భాగస్వామి కావాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఎం నాగేష్

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 02:





భూ భారతి రీ సర్వే ప్రక్రియలో రైతులు, భూ యజమానులు, గ్రామ ప్రజలు చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని జిల్లా అదన్నపు కలెక్టర్ ఎం నాగేష్ విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించిన వివరాలు, సరిహద్దులు, హక్కుల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజలు తమ వద్ద ఉన్న భూ పత్రాలను అధికారులకు అందించి, సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. సోమవారం వెల్దుర్తి మండలం పెద్దాపూర్ గ్రామ పరిధిలోని మెల్లూరులో నిర్వహించిన భూ భారతి రీ సర్వే గ్రామసభకు అదనపు కలెక్టర్, ఆర్డీవో బావయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ హాజరై రీ సర్వే కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం

- మెదక్? జిల్లా విద్యుత్తు శాఖ ఎస్?ఈ నారాయణ నాయక్

నవంబ్ 2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :



మెదక్? జిల్లాలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్క రించేందుకు నేడు మంగళవారం విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం (కన్స్యూమర్స్? డే) నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్?ఈ నారాయణ నాయక్? తెలిపారు. ఈ సందర్భంగా మెదక్?లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ...జిల్లాలో రైతులకు, గృహావసర విద్యుత్తు వినియోగదారులకు ధీర్ఘకాలికంగా విద్యుత్తు సమస్యలు ఏమైనా ఉన్నా, మీటర్లు, అధిక బిల్లులు వచ్చినా, రైతులకు ట్రాన్స్?ఫార్మర్లకు కానీ, విద్యుత్తు వైర్లకు సంబంధించి తదితర సమస్యలను నేరుగా జిల్లా వ్యాప్తంగా ఆయా సబ్? డివిజనల్? ఆఫీసు, మెదక్, తూప్రాన్ డివిజనల్? ఆఫీసు, మెదక్ జిల్లా సూపరింటెండెంట్? కార్యాలయాల్లో ఈనెల 3న్ బవంఝుఎ 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వినియోగదారుల దినోత్సవ ప్రత్యేక కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని ఎస్?ఈ నారాయణ నాయక్? తెలిపారు. దీంతో పాటు విద్యుత్తు వినియోగదారులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా మెదక్? జిల్లాలోని ఆయా సబ్? డివిజనల్, డివిజనల్?, జిల్లా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. మెదక్? జిల్లాకు సంబంధించి విద్యుత్తు వినియోగదారులు, రైతులు ఈనెల 3వ తేదీ సోమవారం నిర్వహించేవినియోగదారుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్?ఈ నారాయణ నాయక్? కోరారు.

ఫిర్యాదులనుపరిష్కరించాలి: అదనపు కలెక్టర్ నగేష్

నవంబర్2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి:

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకుని నిబంధనల మేరకు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం చేయకుండా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో భూ భారతి 25 ,ఇందిరమ్మ ఇండ్లు 12 ,పెన్షన్ 01,ఇతర 24 మొత్తం 62అందాయన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాలికపై వేధింపులు.. సోదరుడిపై రాయితో దాడి

- నిందితుడికి మూడేళ్ల జైలు .. రూ.20 వేల జరిమానా

- మెదక్ జిల్లా ఎస్పీ.డి. వి. శ్రీనివాస రావు

నవంబర్ 2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :



కృష్ణ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీధర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఆమె సోదరుడిపై రాయితో దాడి చేసిన కేసులో గొల్ల మధు (25) అనే వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు.నవంబర్ 2024లో 16 సంవత్సరాల బాలిక ఐకేపీ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా మధు ఆమె చేయి పట్టుకుని లాగి, తనను ప్రేమించాలని చెబుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమెను వదిలిపెట్టాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె సోదరుడు మధును ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన మధు రాయితో అతడి తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి.ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకరంపేట ఆర్ ఎస్ఐ ఎ. నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించారు. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి మూడేళ్ల కఠిన కారగారా శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎసై నారాయణ, పీపీ బాలయ్య, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కానిస్టేబుల్ జి.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి


- ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలి

నవంబర్ 2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :



తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, సరైన విచారణ లేకుండా ఏ ఒక్క అర్హులైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.డిలీషన్ జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగించడానికి గల కారణాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు నుంచి వచ్చిన అభ్యంతరాలు, వివరణలు, సమర్పించిన పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు, ఫారం-7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, ఓటరు పేరు తొలగింపునకు సంబంధించిన అభ్యర్థనలు, ఫారం-8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలు తదితర దరఖాస్తుల పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా నిర్దిష్ట గడువులోగా విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయానికి స్పష్టమైన కారణాలు తెలియజేస్తూ స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన నోటీసులు, నోటీసుల అందజేత వివరాలు, విచారణ నివేదికలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలు, సంబంధిత పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. భవిష్యత్తులో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు



సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి దశలో తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.జిల్లాల వారీగా ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితా, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్-2026 ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో, నవంబర్ 26, 2026వ తేదీలోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 30, 2026వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

వాల్టా చట్టం ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

అంకురా వెంచర్‌లో అనుమతులు లేని రెండు బోర్లు సీజ్

జిల్లా అధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం..

కొండాపూర్ ప్రజా జ్యోతి:

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అనుమతులు లేకుండా బోర్లు తవ్వితే కఠిన చర్యలు తప్పవని కొండాపూర్ తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని మాందాపూర్ గ్రామ శివారులో ఉన్న అంకురా వెంచర్‌లో సర్వే నంబర్ 116లో అనుమతులు లేకుండా తవ్విన రెండు కొత్త బోర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

నీటి సంక్షోభం నేపథ్యంలో కఠిన ఆదేశాలు

ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐ), గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓ) అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రాలు, చెరువుల సమీప ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొత్త బోర్లు తవ్వకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.వాల్టా చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ బోర్లు తవ్వినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు.



నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు!

బోర్ల తవ్వకాలపై పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా తీవ్రంగా పరిగణిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. నిబంధనల అమలులో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వనరుల పరిరక్షణకు అవసరమైన చర్యలు కఠినంగా తీసుకోవాలని ఆదేశించారు.నీటి వనరుల పరిరక్షణే లక్ష్యం.. వాల్టా చట్ట ఉల్లంఘనలకు చెక్ పెట్టడమే ధ్యేయం!

నేల, నీటి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

- ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

-- మండల వ్యవసాయ అధికారి సారిక

రాయికోడ్ నవంబర్ 02(ప్రజా జ్యోతి):

రైతులు సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ నేల,నీటి వనరులను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సారిక సూచించారు.సోమవారం మండలంలోని షాపూర్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సారిక మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని,అందుబాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించు కోవాలని తెలిపారు. వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు,జీవన ఎరువుల వాడకాన్ని పెంచి రసాయన ఎరువులు,పురుగుమందుల వినియోగాన్ని తగ్గిం చాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయంతో నేల సారాన్ని కాపాడు కోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వివరించారు. రైతులందరూ నీరు, నేల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏటీఎం రమేష్,ఏఈఓలు లక్ష్మీకాంత్, శివకుమార్, ఉపసర్పంచ్ నాగేందర్ రావు,గ్రామ రైతులు పాల్గొన్నారు.



శిల్పకళా అద్భుతాల మధ్య విద్యార్థుల విజ్ఞాన యాత్ర

- వెల్దుర్తి శిల్పకళా వైభవాన్ని వీక్షించిన ఉన్నత పాఠశాల విద్యార్థులు

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య







వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 02:

పుస్తకాల్లో చదివిన చరిత్రను ప్రత్యక్షంగా వీక్షిస్తూ, మన పూర్వీకుల అపూర్వ కళానైపుణ్యాన్ని తెలుసుకుంటూ విద్యార్థులు విజ్ఞానాన్ని సముపార్జించుకున్నారు.విద్యార్థుల్లో చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులను వెల్దుర్తిలోని అద్భుత శిల్పకళా సంపదను సందర్శించేందుకు తీసుకెళ్లారు.ఈ సందర్భంగా విద్యార్థులు శిల్పాలపై చెక్కిన సున్నితమైన కళారూపాలు, అద్భుతమైన శిల్ప నైపుణ్యం, నిర్మాణ శైలిని ఆసక్తిగా పరిశీలించారు. ఆనాటి శిల్పుల అసాధారణ ప్రతిభ, సృజనాత్మకత, కళాత్మక దృష్టి, పూర్వీకుల సంస్కృతి సంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.పాఠ్యపుస్తకాల్లో చదివిన చారిత్రక విశేషాలను కళ్లారా చూడటంతో విద్యార్థుల్లో మరింత ఆసక్తి, ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, తరగతి గది బోధనతో పాటు ఇలాంటి క్షేత్రస్థాయి పర్యటనలు విద్యార్థుల జ్ఞానాన్ని విస్తృతం చేస్తాయని తెలిపారు. చరిత్రపై ఆసక్తి, కళల పట్ల అభిరుచి పెంపొందించడంతో పాటు మన వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యతను విద్యార్థులకు తెలియజేస్తాయని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ న్యాల్కల్ మండల అధ్యక్షునిగా సోన్నయిల సంసోన్ మాదిగ

జహీరాబాద్, నవంబర్ 02(ప్రజా జ్యోతి న్యూస్)



పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం జహీరాబాద్ నియోజక వర్గం, మండల కేంద్రమైన న్యాల్కల్ లో ఎమ్మెస్పి జిల్లా నాయకులు జయరాజ్ మాదిగ అధ్యక్షతన న్యాల్కల్ ముఖ్య కార్య కర్తల సమావేశంలో నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మైసగళ్ల భూచేంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు, అబ్రహం మాదిగ ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు పాల్గొని న్యాల్కల్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా సోన్నయిలా సంసోన్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఆదేశాల మేరకు న్యాల్కల్ అన్ని గ్రామ కమిటీలు ఎమ్మార్పీఎస్ మరియు ఎమ్మెస్ఎఫ్ విద్యార్థి కమిటీలు పూర్తి చేసుకుని భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఈనెల 20 లోపు విద్యార్థి కమిటీలు పూర్తి చేసుకోవాలని అసమా నతలు లేని సమసమాజ నిర్మాణానికి పాటుపడుతూ మందకృష్ణ మాదిగ గారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునివ్వడం జరిగింది. ఇట్టికార్యక్రమంలో ఉల్లాస్ మాదిగ జహీరాబాద్ ఏమ్మార్పీఎస్ ఇంచార్జి, నిర్మల్ మాదిగ మొగుడం పల్లి అధ్యక్షులు, వినోద్, శరణప్ప, సుందర్, ప్రశాంత్, సుక్కప్ప,హనోక్, నిఖిల్, చిన్న, నాథనియల్, అభిరామ్, నవీన్, సునీల్, సురేష్, ప్రమోద్, సుందరాజ్, శ్రీను, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పల్పనూర్ లో ఘనంగా ప్రభుత్వ పాఠశాల బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం

హత్నూర 2నవంబర్ (ప్రజాజ్యోతి)



మండల్ పరిధిలోని నస్తీపూర్ పల్పనూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రభుత్వ పాఠశాల బ్రేక్ ఫాస్ట్ పథకం సోమవారం నాడు ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ శ్రీ బంటు రాయుడు హాజరై, విద్యార్థులకు అల్పాహారం అందించి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాయుడు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉదయాన్నే పౌష్టికాహారం, పాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ సోమవారం ఇడ్లీ సాంబార్,మంగళవారం పూరి ఆలుకుర్మా, బుధవారం దోష చట్నీ, గురువారం ఉప్మా చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ సాంబర్,శనివారం బోండా చట్నీ.అందించడం ద్వారా వారి ఆరోగ్యం, హాజరు శాతం పెరుగుతుందని,ఇది ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని కొనియాడారు. పథకాన్ని విజయవంతం చేయడానికి గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు వార్డ్ మెంబర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖ మంజుల,ఉపాధ్యాయులు వీ సురేష్, దీ శివ బందర్,పాఠశాల వర్కర్లు మన్నె సావిత్రి, ఎర్రోళ్ల రుక్కమ్మ,అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


కరువు మండలాలను ప్రకటించడంలో ప్రభుత్వం విఫలం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్ 2 నవంబర్ (ప్రజా జ్యోతి)

సంగారెడ్డి జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తే, మెదక్ జిల్లాను ఎందుకు విస్మరించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరువు మండలాలను ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని నర్సాపూర్, కాగజ్ మద్దూర్, పెద్ద చింతకుంట, కాజీపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. -35% వర్షపాతం ఉన్న మనోహరాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, అంతకంటే తక్కువ శాతం వర్షపాతం నమోదైన నర్సాపూర్, చిలిపిచెడ్, కొడిపల్లి మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని నిలదీశారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?ప్రభుత్వ పథకాల నష్టం: కరువు మండలంగా ప్రకటిస్తే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పశుగ్రాసం, నీటికి నిధులు వస్తాయని, ఉపాధి పనుల్లో అదనంగా పనులు దొరుకుతాయని గుర్తుచేశారు.కరువు మండలం ప్రకటించకపోతే రైతులు వీటన్నింటినీ కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.?వర్షాలు సరిగా కురకక రైతులు పంట నష్టపోయారని, ఎకరానికి రూ. 30,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. ?క్వింటాల్‌కు రూ. 3300 చెల్లించాలి: వేరే రాష్ట్రాల నుండి వచ్చే ఏజెంట్ సంస్థలు రైతుల నుండి క్వింటాల్‌కు రూ. 3,300 వరకు చెల్లించి ధాన్యాన్ని సేకరిస్తున్నాయని, ధాన్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతే భవిష్యత్తు?





ప్రజా జ్యోతి కథనంతో కదిలిన వ్యవసాయ శాఖ!

- అకాల వర్షాలకు నేలకొరిగిన వరి పంటలు

- మన్సాన్‌పల్లిలో పంట పొలాలను పరిశీలించిన

- వ్యవసాయ విస్తరణ అధికారి జ్ఞానం

పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి





కొండాపూర్, ప్రజా జ్యోతి:

కొండాపూర్ మండల పరిధిలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలకు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడులు పెట్టి, పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన రైతులకు అకాల వర్షాలు తీరని ఆవేదనను మిగిల్చాయి. పంట పొలాలు నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా జ్యోతి కథనంతో కదిలిన అధికారులు!

అకాల వర్షాలకు వరి పంటలు నేలకొరిగి రైతులు నష్టపోతున్నప్పటికీ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించడం లేదంటూ సోమవారం ప్రజా జ్యోతి జాతీయ దినపత్రికలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించరా? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనం వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో అధికారులు స్పందించి పంట పొలాల పరిశీలన చేపట్టారు. దీంతో పంట నష్టంపై అధికారుల దృష్టి పడేలా వార్తాకథనం కీలకంగా నిలిచింది.

మన్సాన్‌పల్లిలో పంట పొలాల పరిశీలన

కొండాపూర్ మండలంలోని మన్సాన్‌పల్లి గ్రామంలో అకాల వర్షాలకు నేలకొరిగిన వరి పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి జ్ఞానం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు హరిజన్ నర్సింలు, ఇంద్రుపాటి రామచంద్రయ్య, బుచ్చయ్య సాగు చేసిన వరి పంట పొలాలను సందర్శించి, వర్షాల కారణంగా పంట ఏ మేరకు దెబ్బతిన్నదో పరిశీలించారు. రైతులు ఎంతో శ్రమించి సాగు చేసిన పంట నేలకొరగడంతో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.వరి పంట కోతకు వచ్చే దశలో అకాల వర్షాలు కురవడంతో పంట నేలకొరిగిందని, దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించి పంటను


ప్రజాజ్యోతి
02 Nov 2026 - Page 8

కొండాపూర్ మండలంలో అకాల వర్షాలకు నేలపాలైన వరి పంట!

- అన్నదాతకు కన్నీళ్లే మిగిలాయి..
- పంట నష్టంపై వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?
- క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత రైతులకు న్యాయం చేయాలి...
- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలి



పండిస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట పరిస్థితిని పరిశీలించడం, నష్టాన్ని అంచనా వేయడం ఎంతో అవసరమని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పంట నష్టంపై సమగ్ర అంచనా వేయాలి

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవంగా జరిగిన నష్టాన్ని గుర్తించాలని రైతులు కోరుతున్నారు. కేవలం పంట పొలాలను సందర్శించడంతోనే పరిమితం కాకుండా, నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి అందాల్సిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టంపై సంబంధిత ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించి రైతులకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.

రైతులకు న్యాయం జరిగేనా?

ప్రజా జ్యోతి జాతీయ దినపత్రికలో ప్రచురితమైన కథనం అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి పంట పొలాలను పరిశీలించడంతో రైతుల్లో కొంత ఆశ నెలకొంది. అయితే పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి, అర్హులైన రైతులకు తగిన సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పత్రికల బాధ్యత. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయంపై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాసేవే పరమావధిగా ప్రవీణ్ ముదిరాజ్ ప్రస్థానం!

- దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో మరోసారి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రవీణ్ ముదిరాజ్

యువతలో రాజకీయ చైతన్యం..బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం









అందోలు, నవంబర్02, (ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం)

ఉన్నత చదువులు.. అమెరికాలో ఉద్యోగం.. స్థిరమైన జీవితం.. ఇవే నేటి యువతలో చాలామంది లక్ష్యాలైతే, అందుకు భిన్నంగా ప్రజాసేవనే పరమావధిగా ఎంచుకున్నారు అందోల్ మండలం కన్సాన్‌పల్లికి చెందిన ప్రవీణ్ ముదిరాజ్. ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాలో స్థిరపడే అవకాశాన్ని సైతం వదులుకొని ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టారు. తన చుట్టూ ఉన్న సామాజిక అసమానతలు, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో మరోసారి అందోల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు కొనసాగిస్తుండటం ఆయన రాజకీయ ప్రయాణంలో మరో కీలక ఘట్టం.

అమెరికా అవకాశాన్ని వదులుకొని..

మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ప్రవీణ్ ముదిరాజ్ చిన్ననాటి నుంచి సమాజంలోని పరిస్థితులను గమనిస్తూ పెరిగారు. తెనుగు సునీత, మహిపాల్ దంపతుల కుమారుడైన ఆయన జోగిపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల, డాన్ బాస్కో పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి సీఎంఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివారు. అనంతరం అమెరికాలో ఉద్యోగం చేసి స్థిరపడాలనే ఆలోచన ఉన్నప్పటికీ.. సమాజంలో నెలకొన్న అసమానతలు, అణగారిన వర్గాల సమస్యలు ఆయన ఆలోచనా విధానాన్ని మార్చాయి. వ్యక్తిగత జీవితం కంటే సమాజం కోసం పనిచేయడమే ముఖ్యమని భావించి విదేశీ అవకాశాన్ని పక్కనపెట్టి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

దామోదర ఆశీస్సులతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు

మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో యువజన కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషించిన ప్రవీణ్ ముదిరాజ్ అందోల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేస్తూ, యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఆయనకు దామోదర రాజనర్సింహ ఆశీస్సులు లభించడంతో మరోసారి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు కొనసాగిస్తున్నారు. ఈ అవకాశాన్ని యువతను మరింత సంఘటితం చేయడానికి, ప్రజా సమస్యలపై యువత తరఫున గళమెత్తడానికి వినియోగించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

యువగర్జనలో కీలక పాత్ర

2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో 'త్రిషమ్మ కు నమ్మిన బంటు' గా ప్రవీణ్ ముదిరాజ్ క్రియాశీలకంగా వ్యవహరించారు. జోగిపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి యువగర్జన కార్యక్రమం విజయవంతం కావడంలో తన వంతు పాత్ర పోషించారు. త్రిషమ్మ నాయకత్వంలో సాగిన యువగర్జనతో పాటు 'పల్లె పల్లెకు త్రిషమ్మ' కార్యక్రమంలోనూ యువకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుకగా..

సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలు, ఆధిపత్య ధోరణులు తొలగిపోవాలంటే యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రవీణ్ ముదిరాజ్ భావిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం తన వంతు కృషి చేస్తున్నారు. సామాన్యుల సమస్యలపై స్పందిస్తూ యువతను ప్రజా పోరాటాల్లో భాగస్వాములను చేస్తున్నారు. రాజకీయాలు పదవుల కోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదిక కావాలనే లక్ష్యంతో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.అమెరికా అవకాశాన్ని వదులుకొని ప్రజాజీవితాన్ని ఎంచుకోవడం నుంచి రెండోసారి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం వరకు ప్రవీణ్ ముదిరాజ్ ప్రయాణం సాగుతోంది. వ్యక్తిగత ఆశయాలకు మించి సామాజిక బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేయాలనే ఆయన ప్రయత్నం ప్రస్తుతం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



ఎంపీఓ హెచ్చరికలు బేఖాతర్..

- రెండు రోజుల్లోనే పంచాయతీ అనుమతులు!- మన్సాన్వల్లి 189 సర్వే నంబర్‌లో ఇదేం వింత?

- అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలన్న ఎంపీఓ..

- మూడు రోజులు గడవకముందే అనుమతులు ఎలా జారీ చేశారు?



కొండాపూర్, ప్రజా జ్యోతి: మన్సాన్వల్లి గ్రామ పరిధిలోని 189 సర్వే నంబర్‌లో నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) హెచ్చరిస్తుండగా.. మరోవైపు కేవలం రెండు రోజుల్లోనే పంచాయతీ అనుమతులు జారీ చేసినట్లు వస్తున్న ఆరోపణలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. అధికారుల హెచ్చరికలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేకపోవడంపై స్థానికంగా ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హెచ్చరికలతోనే సరిపెట్టారా?

మన్సాన్వల్లిలో అక్రమ నిర్మాణాల దందాపై ప్రజా జ్యోతి జాతీయ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి



స్పందించిన కొండాపూర్ మండల ఎంపీఓ యాదగిరి శుక్రవారం వెంచర్ యజమానులను హెచ్చరించారు. సంబంధిత అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే ఈ హెచ్చరికలు చేసిన మూడు రోజులు కూడా గడవకముందే సదరు సర్వే నంబర్‌లో పంచాయతీ అనుమతులు జారీ అయినట్లు ప్రచారం జరుగుతుండటంతో అసలు ఏం జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రెండు రోజుల్లోనే అనుమతులు ఎలా సాధ్యం?

సాధారణంగా నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు అందినప్పుడు సంబంధిత పత్రాలు, భూమి వివరాలు, అవసరమైన అనుమతులు, నిబంధనలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు వారం నుంచి 15 రోజుల వరకు సమయం పడుతుందని స్థానికంగా చెబుతున్నారు. అలాంటప్పుడు 189 సర్వే నంబర్‌లో దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే అనుమతులు ఎలా జారీ అయ్యాయి? దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించారా? సంబంధిత భూమి స్వభావం, రెవెన్యూ రికార్డులు, ఇతర శాఖల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.



వివాదాస్పద భూమిలో అనుమతుల మంజూరుపై అనుమానాలు!

మన్సాన్వల్లి 189 సర్వే నంబర్‌కు సంబంధించి 22-ఏ జాబితా, ప్రభుత్వ భూమి, సర్కారు కంచె, ప్రొహిబిటెడ్ జాబితా, కోర్టు కేసులు వంటి అంశాలపై ఆరోపణలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించకుండా, భూమి స్థితిగతులపై స్పష్టత తీసుకోకుండా పంచాయతీ అనుమతులు జారీ చేసి ఉంటే అది తీవ్ర పరిశీలనకు అర్హమైన అంశమే. అయితే ఈ భూమి వాస్తవ స్థితి, అనుమతుల చట్టబద్ధతను సంబంధిత శాఖల అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంది.



ప్రజాజ్యోతి
31 Oct 2026 - Page 8

మన్సాన్వల్లిలో అక్రమ వెంచర్లపై పంచాయతీ అధికారుల కొరడా!

- ప్రజా జ్యోతి కథనానికి స్పందన..

అక్రమ నిర్మాణ పనులు నిలిపివేసిన ఎంపీఓ యాదగిరి..

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని వెంచర్ నిర్వాహకులకు హెచ్చరిక..

ఎంపీఓ ఆదేశాలు అమలు చేస్తున్నారా?

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని ఎంపీఓ హెచ్చరించిన నేపథ్యంలో, ఆ తర్వాత జరిగిన పరిణామాలపై అధికారులు దృష్టి సారించారా? సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అనుమతులు జారీ చేసే ముందు సంబంధిత భూమి వివరాలను పరిశీలించారా? అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. ఎంపీఓ హెచ్చరికలు ఒకవైపు.. అనుమతుల మంజూరు మరోవైపు అన్న పరిస్థితిపై ఉన్నతాధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి

మన్సాన్వల్లి 189 సర్వే నంబర్‌లోని భూమి స్వభావం, రెవెన్యూ రికార్డులు, ప్రొహిబిటెడ్ జాబితా వివరాలు, కోర్టు కేసుల స్థితి, పంచాయతీ అనుమతుల మంజూరు ప్రక్రియపై జిల్లా పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు? ఏ పత్రాల ఆధారంగా మంజూరు చేశారు? సంబంధిత అధికారుల పరిశీలన జరిగిందా? నిబంధనల ఉల్లంఘన జరిగితే ఎవరు బాధ్యులు? అన్న అంశాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.విచారణలో అక్రమాలు లేదా విధి నిర్వహణలో నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారుల హెచ్చరికలు కాగితాలకే పరిమితమవుతున్నాయా? లేక నిబంధనల ప్రకారమే అనుమతులు జారీ అయ్యాయా? అన్నది జిల్లా అధికారుల విచారణతోనే తేలాల్సి ఉంది.

కొండాపూర్‌లో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందా?

- ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు ఎప్పుడు?

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోరా?

- ఉన్నతాధికారులు స్పందించాలి!

కొండాపూర్, ప్రజాజ్యోతి:

కొండాపూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయనే ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారాలపై సంబంధిత రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు స్పందించి భూములను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లిమన్నాన్నపల్లి గ్రామం -- 222 సర్వే నంబర్‌లో అసైన్డ్ భూముల



విక్రయాలు!లి

మన్సాన్నపల్లి గ్రామ పరిధిలోని 222,190 సర్వే నంబర్‌లో హైదరాబాద్‌కు చెందినదిగా పేర్కొంటున్న సుమారు రెండు ఎకరాల అసైన్డ్ భూమిని గుంటల చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు, మామిడి తోట వ్యాపారం కొనసాగిస్తున్నారు.అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలి.

సి.కోనాపూర్ -- ప్రభుత్వ భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం!

కోనాపూర్ గ్రామ పరిధిలో అంకుర వెంచర్‌కు సంబంధించి ప్రభుత్వ భూమిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఎవరు ఇచ్చారు? ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఉందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలి.

మాందాపూర్ 88 సర్వే నెంబర్ లో నుండి పట్టా పాలంలోకి

రహదారి.

మాందాపూర్ శివారులోని 88 ప్రభుత్వ భూముల నుండి 89 పట్టా పొలంలోకి భారీగా మట్టి తరలించి పట్ట పొలానికి దర్జాగా రహదారి నిర్మించుకున్నారు.

సైదాపూర్ -- రెండు ఎకరాల భూమిలో సాగు!

సైదాపూర్ గ్రామంలో సుమారు రెండు ఎకరాల రైతు భూమిని ఆక్రమించి, కౌలు పేరుతో వరి సాగు చేస్తూ బోరు ఏర్పాటు చేసి వ్యవసాయం చేస్తున్నట్లు సమాచారం. ఈ భూమికి సంబంధించిన హక్కులు, సాగు వివరాలపై రెవెన్యూ అధికారులు విచారణ చేయాలి.

కొండాపూర్ -- 555 సర్వే నంబర్‌లో భూముల ఆక్రమణ పై


ప్రజాజ్యోతి
26 Oct 2026 - Page 6
అసైన్డ్ ప్రభుత్వ భూమిలో రోడ్డు.. అంకుర వెంచర్‌పై చర్యలు ఉండవా?
- అసైడ్ ప్రభుత్వ భూమి కబ్జా చేయొచ్చా?- ప్రభుత్వ భూమిని ఆక్రమించి
సీసీ రోడ్డు నిర్మాణం.- సి.హెచ్. కోనాపూర్, మాందాపూర్ శివారులో
వెంచర్ వ్యవహారం- అధికారుల మౌనం వెనుక కారణమేంటి? అనుమతులపై స్పష్టత ఇవ్వాలి!
- కొండాపూర్ ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్


ప్రజాజ్యోతి
26 Oct 2026 - Page 2
అసైన్డ్ భూముల్లో ప్లాట్ల విక్రయాలు!
మొదలైన తరుబాయి

ఆరోపణలు

కొండాపూర్ గ్రామ పరిధిలోని 555 సర్వే నంబర్‌లో రోజురోజుకూ రెండు నుంచి నాలుగు ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు సమాచారం. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రమేయం ఉందని స్థానికంగా ఆరోపిస్తున్నారు.ఈ అంశంపై సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మల్కాపూర్ -- ప్రభుత్వ భూమిలో సీసాల కంపెనీ ఏర్పాటు!

మల్కాపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో సీసాల కంపెనీ ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఏ ప్రాతిపదికన వినియోగిస్తున్నారు? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం వస్తోందా? భూమి కేటాయింపులకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా? అనే విషయాలను అధికారులు వెల్లడించాలి.ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు? ఆయా సర్వే నంబర్లలో భూముల హద్దులను గుర్తించి సర్వే ఎప్పుడు నిర్వహిస్తారు? ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు, వెంచర్లు, కంపెనీల ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా?అసైన్డ్ భూముల విక్రయాలను అరికట్టేందుకు చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?.



ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి. వాటి పరిరక్షణ రెవెన్యూ అధికారుల బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడేందుకు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి. అసైన్డ్ భూముల అక్రమ లావాదేవీలను అరికట్టాలి. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు స్పందించి ప్రభుత్వ భూముల వివరాలను ప్రజల ముందుంచి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యూహాత్మక నిర్ణయాలకు ఆర్థిక పరిజ్ఞానం కీలకం

- గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల ఎండీపీ

- మేనేజర్లు, వృత్తి నిపుణులకు సదవకాశం..

- ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలి

పటాన్ చెరు(ప్రజాజ్యోతి)

వ్యాపార రంగంలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు సంస్థల ఆర్థిక నిర్వహణపై పట్టు సాధించేందుకు మేనేజర్ లకు వృత్తి నిపుణులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 19, 20 తేదీల్లో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ) నిర్వహించనుంది. నిర్వాహక నైపుణ్యం కోసం ఆర్థిక పరిజ్ఞానం' అనే హైబ్రిడ్ విధానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్వాహకులు వెల్లడించారు.

ఆర్థిక అంశాలపై సమగ్ర అవగాహన

ఫైనాన్స్‌లో ప్రత్యేక విద్యార్హతలు, అధికారిక నేపథ్యం లేని మేనేజర్ లు, వృత్తి నిపుణులను దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణను రూపొందించారు. ఆర్థిక విశ్లేషణ, వ్యయ నిర్మాణాలు, బడ్జెట్ రూపకల్పన, మూలధన కేటాయింపు, పెట్టుబడిపై రాబడి, పెట్టుబడుల మూల్యాంకనం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించనున్నారు. వీటితోపాటు ఈవీఏ, డబ్ల్యుఏసీసీ, సీఏపీఎం, ఆర్థిక అంచనాలు, ఆధునిక మూలధన బడ్జెట్ పద్ధతులపై ఆచరణాత్మక శిక్షణ అందించనున్నారు.

ప్రత్యక్ష అభ్యాసానికి ప్రాధాన్యం

ఐదు దశల అభ్యాస విధానంలో భాగంగా అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, పరిష్కరించడం, నమూనా రూపొందించడం, ప్రదర్శించడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుంది. వాస్తవ వ్యాపార పరిస్థితులు, కేస్ స్టడీలు, ప్రత్యక్ష అభ్యాసాల ద్వారా ఆర్థిక సమస్యలను

GITAM
DEEMED TO BE UNIVERSITY

విశ్లేషించడం, పెట్టుబడి అవకాశాలను అంచనా వేయడం, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో నైపుణ్యాలను పెంపొందించనున్నారు.

నిపుణుల ఆధ్వర్యంలో శిక్షణ

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అకౌంటింగ్, ఫైనాన్స్ విభాగానికి చెందిన డాక్టర్ సుశోభన్ పాల్, డాక్టర్ మెరుగు వేణుగోపాల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పాల్గొనే వారికి అభ్యాస సామగ్రితోపాటు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు.ఆసక్తి ఉన్నవారు పేర్ల నమోదు, రుసుము, ఇతర వివరాల కోసం 84209 66501 నంబర్‌ను సంప్రదించాలని లేదా ఎఎవఏస్త్రఱ్ఱుఎ.వఎబకు ఈ-మెయిల్ చేయాలని నిర్వాహకులు సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

ప్రజావాణికి 68 దరఖాస్తులు

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి : -

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తుల విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని అదనపు కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు .ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 దరఖాస్తులు అందాయి. వీటిలో సంగారెడ్డి 21, నారాయణఖేడ్ 3, జహీరాబాద్ 2, సంగారెడ్డి కలెక్టరేట్‌లో 42 దరఖాస్తులు వచ్చాయి. అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు . వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి , సోషల్ వెల్ఫేర్ డి డి అఖిలేష్ రెడ్డి , జిల్లా బి సి సంక్షేమాధికారి జగదీష్ , జిల్లా సంక్షేమాధికారిణి లలితా కుమారి ,జిల్లా వైద్యాధికారిణి లలిత దేవి ,డి ఏ హెచ్ ఓ వసంతకుమారి, డి ఎల్ ఎస్ ఏ అడ్వొకేట్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులు దళారులను ఆశ్రయించొద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- సోలక్‌పల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(ప్రజాజ్యోతి)

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలంటే దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు తమ ధాన్యాన్ని నేరుగా ఈ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, ధాన్యం విక్రయానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు.





బోనస్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బోనస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో సేకరించాలని, కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోపాటు బోనస్ సకాలంలో అందితే వారికి ఆర్థికంగా మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, తూకం, ధాన్యం సేకరణ, ఇతర ప్రక్రియల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులు దళారుల చేతుల్లో నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్దన్, మున్సిపల్ కమిషనర్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్‌గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్ లు, పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ లు కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ 2 నవంబర్ (ప్రజా జ్యోతి)

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్యా నాయక్ తెలిపారు. ఈ పోస్టుకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు, ఐదు నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ లేదా జనరల్ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా/పీజీ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆర్‌సీఐ నమోదు కార్డు, ఆధార్ ప్రతులు, బయోడేటాతో పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రకటనలో దరఖాస్తుల చివరి తేదీ 03-11-2023గా ఉంది. ఇది గడిచిన తేదీ. 2026 నవంబర్ 3 అని తెలిపారు.



పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం

జహీరాబాద్, నవీంబర్ 02(ప్రజా జ్యోతి న్యూస్)

మొగుడంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఉపాధ్యాయురాలు మయూర నీత పదవి విరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం పాల్గొని పూలమాల, శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వై. నరోత్తం మాట్లాడతు.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దిన ఘనత ఉపాధ్యాయులదని సోమవారం ఉపాధ్యాయు లుగా పదవి విరమణ పొందిన మీరు శేష జీవితం సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, శివ కుమార్, చంగల్ జైపాల్, యస్.గోపాల్, యం. మల్లెషం, ఉపాధ్యాయు రాలు మేరినా,నఫ్రుల్లా ఖాన్, కే.మల్లేశం, ఉపాధ్యాయు లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించేది లేదు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి..
బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలి
కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి.. అధికారులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచన

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు.సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతు వేదికలో నందికంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యత కల్పించాలని, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని సూచించారు. ప్రతి క్వింటాల్ సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను తప్పనిసరిగా అందించాలని, గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను సైతం వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు



చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని పేర్కొన్న ఎమ్మెల్యే గారు ... రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వ ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాముగోపాల్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, చక్రపాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సుధాకర్, లక్ష్మారెడ్డి, సర్పంచ్ అశోక్ గౌడ్, రాజు, మనీష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొహిబిటెడ్ జాబితా నుంచి భూమిని తొలగించాలని ప్రజావాణిలో వినతి

- ప్రజావాణికి అబ్కారీ శాఖ అధికారులు గైర్హాజరు!

రాయికోడ్ నవంబర్ 02 (ప్రజా జ్యోతి):

మండల పరిధిలోని జామాల్పూర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 39/ఉ1లో ఉన్న మూడు ఎకరాల భూమిని ప్రొహిబిటెడ్ (నిషేధిత) జాబితా నుంచి తొలగించాలని కోరుతూ భూమి యజమాని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.తమ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్,పాత రెవెన్యూ రికార్డులు,ఆర్ఓఆర్ తదితర ఆధారాలు ఉన్నప్పటికీ నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర భూ లావాదేవీలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సంబంధిత రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,నిబంధనల ప్రకారం అర్హత ఉంటే భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరారు.ఇదిలా ఉండగా,సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అబ్కారీ శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షరీఫ్ మాట్లాడుతూ.. గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షరీఫ్, ఎమ్మార్వో ఆశాజ్యోతి, ఎంఈఓ నర్సింహులు, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి,ఎంపీఓ సంతోష్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కూలీల సంఖ్య పెరిగితేనే గ్రామాల అభివృద్ధి

- ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

- సబ్ కలెక్టర్ ఉమా హారతి - అధికారుల అలసత్వం, అవగాహన లోపంపై సమీక్ష..

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు - అడిషనల్ పీడీ బాలరాజ్

కల్హేర్, నవంబర్ 2, ప్రజాజ్యోతి:

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి సూచించారు. గ్రామాల్లోని ప్రతి అర్హులైన కూలీకి ఉపాధి కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తప్పవని అడిషనల్ పీడీ బాలరాజ్ హెచ్చరించారు.సోమవారం కల్హేర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో (వీ.బీ జి. రాం జి.) ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి మాట్లాడుతూ.. కల్హేర్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు కూలీల సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవసరమున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని కల్పించాలని అధికారులను ఆదేశించారు.మండలం ఉపాధి హామీ పనుల్లో వెనుకబడటానికి కారణాలేమిటి? అధికారుల అలసత్వమా? లేక కూలీలకు పథకంపై సరైన అవగాహన కల్పించడంలో లోపమా? అనే అంశాలపై సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన కూలీలు ఉన్నప్పటికీ వారికి ఎందుకు పని కల్పించడం లేదనే విషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి, కూలీలకు పథకం ప్రయోజనాలను వివరించాలని సూచించారు.గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా బాధ్యత తీసుకోవాలని, తమ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెరిగేలా



చొరవ చూపాలని కోరారు. కూలీల భాగస్వామ్యం పెరిగితేనే గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు, గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

అనంతరం అడిషనల్ పీడీ బాలరాజ్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనుల అమలులో పారదర్శకత పాటించాలని, నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకూడదని సూచించారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.2025 సంవత్సరం నుంచి 2026 మార్చి వరకు కల్హేర్ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.1 కోటి 11 లక్షల మేర కూలీలకు లబ్ధి చేకూరినట్లు సామాజిక తనిఖీ నివేదికలో వెల్లడించారు. తనిఖీల్లో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్ల విధి నిర్వహణలో తప్పిదాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుకునేందుకు సంబంధిత సిబ్బందికి అవకాశం కల్పించినట్లు



వివరించారు.

ప్రజావేదికలో సామాజిక తనిఖీ నివేదిక

కార్యక్రమంలో డీఆర్పీలు గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలు, గుర్తించిన లోపాలు, అభ్యంతరాలు, నివేదికలోని అంశాలను ప్రజావేదికలో చదివి వినిపించారు. పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, కూలీలకు పని కల్పించే విధానం, రికార్డుల నిర్వహణ, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. కూలీల సంఖ్య పెంపు, పనుల నిర్వహణలో పారదర్శకత, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినందన్ రావు, ఏపీవో గురుపాదం, టెక్నికల్ అసిస్టెంట్ రామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో తెలంగాణ ప్రముఖులతో జీఎంఆర్ మచ్చేందర్ ఆత్మీయ భేటీ

- న్యూయార్క్‌లో డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, మిట్టపల్లి సురేందర్‌లకు దసరా శుభాకాంక్షలు

కల్హేర్, నవంబర్ 2, ప్రజాజ్యోతి:

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని అమెరికాలోని న్యూయార్క్‌లో ప్రముఖ ఫార్మాస్యూటికల్ పారిశ్రామికవేత్త డాక్టర్ పైళ్ల మల్లారెడ్డిని నారాయణఖేడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సతీమణిని కూడా ఆత్మీయంగా కలుసుకున్నారు.తెలంగాణలో జన్మించి అమెరికాలో ఫార్మాస్యూటికల్ రంగంలో విశేష విజయాలు సాధించిన డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని మచ్చేందర్ పేర్కొన్నారు. 1995లో బాక్టలసీ ఫార్మాస్యూటికల్ సంస్థను స్థాపించి, నాణ్యమైన ఔషధాలు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తుల తయారీలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతికత, నాణ్యతా ప్రమాణాలతో ఫార్మాస్యూటికల్ రంగంలో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాగే తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టాటా) వ్యవస్థాపకుల్లో ఒకరిగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు తెలుగు సమాజ అభ్యున్నతికి డాక్టర్ మల్లారెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.అనంతరం అమెరికాలో ఫార్మాస్యూటికల్ వ్యాపార రంగంలో రాణిస్తున్న లక్ష్మారెడ్డిని కూడా మచ్చేందర్ ఆత్మీయంగా కలుసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ పైళ్ల మల్లారెడ్డిని ఆదర్శంగా తీసుకొని లక్ష్మారెడ్డి వ్యాపార రంగంలో ఎదగడం స్ఫూర్తిదాయకమన్నారు.అదేవిధంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన గేయాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రముఖ గేయ రచయిత, బీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి సురేందర్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీకి తన రచనలు, సాహిత్యం ద్వారా విశేష సేవలందించిన సురేందర్‌తో ఆత్మీయంగా ముచ్చటించి దసరా శు భాకాంక్షలు తెలిపారు. గుర్రపు మచ్చేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటుతున్న డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, మిట్టపల్లి సురేందర్‌లను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పెద్దల అనుభవం, మార్గదర్శకత్వం, ఆశీస్సులు



ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ప్రజాసేవే లక్ష్యంగా, నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని గుఱ్ఱపు మచ్చేందర్ తెలిపారు.

1008 నాగదేవతలకు పూజలు

- మానసాదేవి ఆలయంలో రాహు కేతు హోమం

- హాజరైన సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

జహీరాబాద్, నవంబర్ 02(ప్రజా జ్యోతి న్యూస్)

నాగదేవత ఆరాధనకు హిందూ సంప్రదాయంలో విశిష్ట స్థానం ఉందని, సర్పదోషం, కాలసర్పదోషం ఉన్నాయని భావించే భక్తులు వివాహం, సంతానం, విద్య, వ్యాపారం, ఆర్థిక సమస్యల నుంచి ఉపశమనం కోరుతూ నాగదేవతను భక్తిశ్రద్ధలతో పూజిస్తారని భారత్ మహాన్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహామండ లేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరా నందగిరి మహారాజ్ పేర్కొన్నారు. సోమవారం ఆశ్లేష నక్షత్రం సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని అష్టోత్తర సహస్ర నాగదేవత మానసాదేవి ఆలయంలో 1008 నాగదేవతలకు, రాహు కేతువులకు ప్రత్యేక పూజలు, రాహు కేతు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన





హాజరై భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించి ఆశిస్సులు అందజేశారు. ప్రతి నెలా నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యత ఉందని, దేశవ్యాప్తంగా ఉన్న నాగదేవత ఆలయాల్లో జహీరాబాద్ పట్టణంలోని మానసాదేవి ఆలయానికి ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. పట్టణానికి చెందిన 21 మంది దంపతులు నాగదేవత పూజల్లో పాల్గొన్నారు. పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాబురావు మల్కాపూర్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు రేఖ మల్కాపూర్, ఆలయానికి సంబంధించిన కమిటీ సభ్యులు అందరూ హాజరై భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఖోఖోలో సత్తా చాటిన కన్సాన్‌పల్లి విద్యార్థిని పల్లవి

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ..- ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక- పల్లవిని అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం

అందోలు, అక్టోబర్ (ప్రజాజ్యోతి):

క్రీడల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన ఖోఖో పోటీల్లో కన్సాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం. పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకుంది. తన ఆటతీరుతో ప్రతిభను చాటుకున్న పల్లవి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్న పల్లవి జిల్లా స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత రాణి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శైలజ, పీఈటీ యాదయ్య పల్లవిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. పల్లవి ఇదే ఉత్సాహంతో రానున్న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. పల్లవి సాధించిన ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.

